సాక్షి శ్రీకాకుళం

మంగళవారం ၊ 12 ၊ డిసెంబర్ ၊ 2023



సాంకేతిక సాయం

భవిత కేంద్రాల్లోని పలువురు చిన్నారులకు ప్రభుత్వం సాంకేతిక సాయం అందిస్తోంది. వారికి ట్యాబ్‌లు అందిస్తోంది. - 8లో



ఏడెకరాల వరిపొలం దగ్ధం

ఏఎస్ కవిటి గ్రామంలో పొలాల్లో మంటలు అంటుకున్నాయి. ఏడెకరాల పొలం కాలిపోయింది. - 8లో

మల్లన్న ఆదాయం రూ.8,21,953

టెక్కలి: కార్తీక మాసం నాల్గో సోమవారం సందర్భంగా రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయానికి రూ.8,21,953 ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జి ఈఓ ప్రసాద్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. శీఘ్రదర్శనం ద్వారా రూ.1,97,000, శీర్షాభిషేకం ద్వారా రూ.2,23,000, కేశఖండన ద్వారా రూ.28,040, హుండీల ద్వారా రూ.3,64,913 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఆదాయం తగ్గినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పలాసలో సీఎం పర్యటన ఇలా..

కాశీబుగ్గ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలాస పర్యటన షెడ్యూల్ ఖరారైంది. అధికారులు సోమవారం రాత్రి షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఆ మేరకు..

- 14వ తేదీ గురువారం ఉదయం 8 గంటలకు ముఖ్యమంత్రి తన ఇంటి నుంచి బయల్దేరి రోడ్డు మార్గం గుండా గన్నవరం ఎయిర్‌పోర్టుకు 8.20కు చేరుకుంటారు.
- గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి 8.20కు బయలుదేరి విమానంలో విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో 9.30కు ల్యాండ్ అవుతారు.
- అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.35కు కంచిలి మండలం మకరాంపురం గ్రామంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 10. 35 నుంచి 10. 45 ప్రజల నుంచి స్థానిక సమస్యలపై వినతులు స్వీకరిస్తారు.
- అనంతరం మకరాంపురంలోని వైఎస్సార్ సుజల ధారలో ఏర్పాటుచేసిన పంపింగ్ స్టేషన్‌కు చేరుకుంటారు. 10.50 నుంచి 11.10 గంటల మధ్యలో వైఎస్సార్ సుజలధార పథకాన్ని ప్రారంభిస్తారు.
- అనంతరం హెలికాప్టర్‌లో పలాస బయల్దేరి వెళ్తారు.
- 11.30కు పలాస చేరుకుంటారు. అక్కడ ప్రజల నుంచి వినతులు స్వీకరించి 11.40కు పలాస కిడ్నీ పరిశోధన కేంద్రానికి చేరుకుంటారు.
- 11.40 నుంచి 11.55 నిమిషాల మధ్యలో కిడ్నీ పరిశోధన కేంద్రం ప్రారంభించి రోడ్డు మార్గంలో పలాస రైల్వే క్రీడా మైదానానికి చేరుకుంటారు.
- 12.50 నుంచి 1.25 నిమిషాల మధ్యలో స్టాల్స్ సందర్శించి బహిరంగ సభలో మాట్లాడతారు.
- 1.35 నుంచి 2.35 వరకు స్థానిక నాయకులతో ఆయన మాట్లాడతారు.
- 2.40 హెలికాప్టర్‌లో విశాఖ ఎయిర్‌పోర్టుకు బయల్దేరుతారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, వైఎస్సార్ సుజల ధార ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్ జగన్ ఈ నెల 14న జిల్లాకు వస్తున్నారని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జేసీ స్పందనలో అధికారులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ముందుగా 15వ తేదీ అనుకున్నామని, అయితే ఒక రోజు ముందుగానే కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. మరింత వేగంగా సమర్థంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. పర్యటనకు సంబంధించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పలాస రైల్వే మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లు పలు సార్లు పర్యవేక్షించాలని అన్నారు.

స్పందనకు 250 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఉప కలెక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 250 వినతులు అందాయి. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మెప్మా పీడీ కిరణ్, డీఎస్‌ఓ వెంకటరమణ, డ్వామా పీడీ చిట్టిరాజు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిశోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబురావు, బి.శ్రీరామ్మూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరాటాలకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ, సమగ్ర శిక్ష సిబ్బంది నాలుగు నెలల జీతాలు చెల్లింపు, రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం, జీతంతో కూడిన సెలవు తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20 నుంచి సమ్మెలోకి వెళ్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

సీఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పలువురు సీఐలకు స్థాన చలనం కల్పించినట్లు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సోమవారం ప్రకటన విడుదలైంది. ఆ మేరకు.. శ్రీకాకుళం జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(డీసీఆర్బీ) సీఐగా ఉన్న దేవరపల్లి నవీన్‌కుమార్‌ను కాశీబుగ్గ టౌన్‌కు, విశాఖపట్నం రేంజి వీఆర్‌లో ఉన్న ఎస్.శ్రీనివాసరావును శ్రీకాకుళం డీసీఆర్బీ సీఐగా బదిలీ చేశారు.



అలలపై స్వామి

నరసన్నపేట గోరువాని చెరువులో కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా నిర్వహించిన తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. స్థానిక భవానీ పురం వాసులు ఏటా ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. -నరసన్నపేట (పోలాకి)



టెక్కలి మండలం రావివలస ఎండల మల్లన్నకు పూజలు చేస్తున్న భక్తులు



శ్రీముఖలింగం ఆలయం బయట క్యూలో ఉన్న భక్తులు

సదాశివ స్మరామి

ఆలయాల బయట భక్తుల బారులు, ఆవరణ నిండా విభూది పరిమళాలు, గంటకో మారు వినిపించే గంటల గణగణలు, అప్రయత్నంగా నోటి వెంట వచ్చే ఓం నమశ్శివాయ మంత్రాక్షరాలు, గొంతు జారుతూ గుండెలో ఉండిపోయే పంచామృత పానక జ్ఞాపకాలు.. కార్తీకం ఇలాంటి వేల అవ్యక్తానుభూతులు పంచింది. చివరి సోమవారం నాడు భక్తులు శైవ క్షేత్రాల ముందు మోకరిల్లారు. పరమేశ్వరుడిని పరమ పవిత్రంగా అర్చించి తరించారు. -శ్రీకాకుళం కల్చరల్

ప్రణతులివే పరమేశ్వరా..



శ్రీకాకుళం నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర స్వామి ఆలయం ధర్మకర్త జి.అశ్వనీ కుమార్ అర్చకులు మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. ముందుగా ప్రత్యేక రుద్రాభిషేకాలు జరిగాయి. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.



శ్రీకాకుళంలోని బలరామ ప్రతిష్టిత ఉమా రుద్ర కోటేశ్వర స్వామికి సోమవారం 11వేల రుద్రాక్షలతో అలంకరించారు. ప్రధా న అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.



జలుమూరు : శ్రీముఖలింగంలోని మధుకేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వివరాలు భద్రం.. వైద్యం సులభం

- పశువులకు ఆరోగ్య కార్డులు
- పక్కాగా అందనున్న వైద్య సేవలు
- ఆరు పెద్దజీవులకు ఒకకార్డు, 20 మేకలు/గొర్రెలకు ఒకటి
- జీవుల సంఖ్యను బట్టి పాడి రైతులకు కార్డుల జారీ





కాశీబుగ్గ: పశువైద్యం మరింత సులభ రీతిలో జరిగేలా, మూగజీవాలకు వైద్య సేవలు పక్కాగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పశువుల ఆరోగ్య సంరక్షణకు పశువుల ఆరోగ్య కార్డులు తయారు చేసి జారీ చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పశువుల సంఖ్య, వాటికి కావాల్సిన మందులు ఇతర అంశాలకు ఉపయోగపడేందుకు అటు ప్రభుత్వం, ఇటు రైతుకు ఉపయోగపడే గుర్తింపు కార్డు ఇది. అన్ని పశువుల వివరాలు ఆన్‌లైన్ చేసి హోలోగ్రామ్‌తో కూడిన పది అంకెల సంఖ్యలో పొందు పరిచి గుర్తింపును ఇస్తున్నారు. ఈ హోల్‌గ్రామ్‌ను స్కాన్ చేసినపుడు ఆ నంబర్‌తో ఎన్ని జీవాలు ఉన్నాయి, రైతు ఎవరు, ఎలాంటి వ్యాధులు ఉన్నాయి వంటి వివరాలన్నీ తెలుస్తాయి. పశు వైద్యశాఖ వారు ప్రతి పశువుకు కార్డు ఇవ్వకుండా ఆరు పశువులకు (పెద్ద జీవాలు) ఒక ఆరోగ్య గుర్తింపు కార్డును తయారు చేసి ఇస్తున్నారు. ఇక మేకలు/గొర్రెలు అయితే 20 జీవాలకు ఒక ఆరోగ్య కార్డు అందిస్తున్నారు. ప్రధానంగా ఇందులో అనేక రకాల సమాచారం పొందుపరిచి ఉంచుతున్నారు. ఒకప్పుడు పొడవాటి కరపత్రంలా ఉన్నా ప్రస్తుతం ఆ శాఖ వారు దాన్ని తగ్గించి హ్యాండ్‌బుక్ వంటి ఆకారంలో ప్రింట్ చేసి ఉచితంగా అందిస్తున్నారు. ఆర్‌బీకేలు, పశువైద్యశాల సిబ్బంది వీటిని రిజిస్టర్ చేస్తున్నారు.



పశు ఆరోగ్య సంరక్షణ కార్డు

ఉపయోగాలివే..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ తరుపున రెండు రకాల యానిమల్ హెల్త్ (పశు ఆరోగ్య సంరక్షణ)కార్డులను జారీ చేస్తోంది. అందులో ఒకటి పశు ఆరోగ్య సంరక్షణ కార్డు. ఇది గేదెలు, ఆరు ఆవులకు/గేదెలకు /పోతులకు మాత్రమే వర్తిస్తుంది. రెండోది గొర్రెలు/మేకలు ఆరోగ్య సంరక్షణ కార్డు ఇది సుమారు 20 జీవాలకు ఒక కార్డు చొప్పున వర్తిస్తుంది. ఇందులో పశువులను పోషించే పశుపోషకుని వివరాలు, పశుసంపద వివరాలు ఉంటాయి. వ్యాధుల నుంచి టీకాల వరకు సమస్త సమాచారం లభిస్తుంది. మూగజీవాలకు ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే ఈ కార్డుతో చికిత్స అందించడం సులభమవుతుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం లక్షా ముప్పై నాలుగువేల తొమ్మిదివందల అరవై ఒకటి కార్డులు జారీ కాగా అరవై మూడు వేలకుపైగా కార్డులు పాడి రైతులకు అందించారు.

కార్డులు పొందాలి..



జిల్లాలోని ప్రతి ఒక్క పాడి రైతు, గొర్రెల కాపరులు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పొందాలి. ఇవి మా సిబ్బంది రిజిస్ట్రేషన్ చేస్తారు. హోలోగ్రామ్‌తో కూడిన గుర్తింపు కార్డు ప్రతి రైతు వద్ద ఉంటే పశుగణన, వ్యాధుల నిర్ధారణ, ప్రభుత్వం అందించే ఉచిత మందుల పంపిణీ, సమయానికి టీకా వివరాలు, పశుబీమా, ఇలా అన్నింటికీ ఉపయోగపడుతుంది. ఇలాంటి ఆన్‌లైన్ గుర్తింపు పరంగా అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం నుంచి పొందవచ్చు.

– డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖరం, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, పలాస

సత్తా చాటిన మాస్టర్ అథ్లెట్లు



పతకాలతో మోత మోగించిన శ్రీకాకుళం జిల్లా మాస్టర్ అథ్లెట్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం మాస్టర్ అథ్లెట్స్ చరిత్ర సృష్టించారు. రాష్ట్ర పోటీల్లో శ్రీకాకుళం జిల్లా మాస్టర్ అథ్లెట్స్ పతకాలతో సెంచరీ మోత మోగించారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ క్రీడామైదానం వేదికగా ఈనెల 9 నుంచి 11వరకు మూడు రోజులపాటు 42వ ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2023 పోటీలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ఈ పోటీల్లో వివిధ అథ్లెటిక్స్ ఈవెంట్స్ (రన్స్, త్రోస్, జంప్స్) లలో సత్తాచాటారు. ఈ పోటీల్లో 35 మంది వరకు మాస్టర్స్ అథ్లెట్స్ ప్రాతినిధ్యం వహించగా.. మొత్తం 106 పతకాలతో చరిత్ర సృష్టించారు. ఇందులో 67 బంగారు పతకాలు, 24 రజత పతకాలు, 15 కాంస్య పతకాలు ఉన్నాయి.

చాంపియన్‌షిప్‌లోనూ..

రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. మార్చ్‌పాస్ట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జిల్లా బృందం, మహిళల ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి ట్రోఫీని అందుకున్నారు. ఇందులో బంగారు, రజత పతకాలు సాధించిన క్రీడాకారులు జాతీయ పోటీలకు నేరుగా ఎంపికయ్యారు. పతకాలు సాధించిన వారిని పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతోపాటు శ్రీకాకుళం జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ చౌదరి పురుషోత్తమనాయుడు, ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు, చల్లా జగదీష్, భాగ్యలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

58 మందికి రూ. 17.40 లక్షలు

- వైఎస్సార్ లా నేస్తం నగదు జమ



లా నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా జిల్లాలో 58 మందికి లబ్ధి చేకూరింది. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అర్హులైన 58 మంది జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో నెలకు రూ 5000 చొప్పున 6 నెలలకు మొత్తం రూ.17.40 లక్షలు జమ చేయడం జరిగిందన్నారు. యువన్యాయవాదులకు వైఎస్సార్ లా నేస్తం ఎంతగానో ఉపయోగపడుతుందని, న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకునేందుకు దోహద పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులైన లాయర్లు తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు కార్డులు ఇవ్వాలి'

కాశీబుగ్గ: రైతు సమస్యల పరిష్కారానికి అంతా కలిసి పోరాడదామని వామపక్షాలు, రైతు సంఘాల నాయకులు అన్నారు. వీరి ఆధ్వర్యంలో కాశీబుగ్గలో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి సీపీఐ నాయకులు చాపర వెంకటరమణ అధ్యక్షతన వహించగా సీపీఐ, సీపీఎం, ఎంఎల్ లిబరేషన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు చాపర వేణుగోపాల్, నెయ్యిల గణపతి, మద్దిల మల్లేశ్వరరావు, ఎం.భీమన్నలు పాల్గొని మాట్లాడారు. తుఫాన్‌కు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర, పంట కొనుగోలు అవకాశం కల్పించాలన్నారు. అంతర్జాతీయ లావాదేవీల వల్ల జీడి రైతుకు జరుగుతున్న నష్టాన్ని సబ్సిడీ రూపంలో అందించాలన్నారు. జీడి కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, శివారుకు నీరందించాలని కోరారు.

సీఎం పర్యటనకు జోరుగా ఏర్పాట్లు

కాశీబుగ్గ: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా పర్యటన ఖరారైన నేపథ్యంలో సభాస్థలి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కిడ్నీ ఆస్పత్రి ప్రారంభం అనంతరం ఆయన బహిరంగ సభలో పాల్గొననుండడంతో పలాస రైల్వే స్టేషన్ ఆవరణలోని క్రీడా మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం పనులు పరిశీలించారు. 14వ తేదీన సీఎం రానుండడంతో రహదారితో పాటు పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రం చేస్తున్నారు. ఎస్పీ రాధిక సైతం సోమవారమంతా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోనే గడిపారు. కిడ్నీ ఆస్పత్రిని అన్ని శాఖల అధికారులు పర్యవేక్షించి ఏర్పాట్లకు సంబంధించిన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.



పలాసలో హెలీప్యాడ్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక



ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

కంచిలి: మండలంలోని మకరాంపురంలో ఈ నెల 14వ తేదీన ఉద్దానం వాటర్ ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను ప్రారంభించడానికి సీఎం వైఎస్ జగన్ వస్తున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సోమవారం పరిశీలించారు. వాటర్ ప్రాజెక్టు వద్ద పనుల్ని పరిశీలించిన ఆయన అనంతరం అంపురం వద్ద సీఎం జగన్ దిగడానికి నిర్మిస్తున్న హెలీప్యాడ్ పనుల్ని కూడా పరిశీలించి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. పర్యటనలో పలాస ఆర్డీఓ భరత్‌నాయక్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, స్థానిక తహసీల్దార్ ఎస్.హైమావతి, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

హెలీప్యాడ్ స్థలం పరిశీలన

కాశీబుగ్గ: సీఎం వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా ఎస్పీ రాధిక పలాసలో పలు ప్రాంతాలు పరిశీలించారు. పలాస పాత జాతీయ రహదారికి ఆనుకుని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఎదురుగా ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్ సమీపాన కొత్తగా హెలీ ప్యాడ్ నిర్మించాలని సూచించారు. ముందు ఓ స్థలాన్ని ఎంపిక చేసినా తాజాగా దాన్ని మార్చారు. ఈ కార్యక్రమానికి ముందు ఎస్పీ కంచిలి మండలం మకరాంపురం గ్రామంలో మంచినీటి ప్రాజెక్టు ప్రారంభ స్థలం, అక్కడి హెలీప్యాడ్, పలాస కిడ్నీ ఆస్పత్రి, పలాస రైల్వేక్రీడా మైదానంలో సభా స్థలి పరిశీలించారు. పలాస కిడ్నీ ఆస్పత్రిలో కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ నవీన్ కుమార్‌లతో పాటు పోలీసు ఉన్నతాధికారులు, సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



హిరమండలం బస్ షెల్టర్ చుట్టూ కట్టిన గోడను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

హిరమండలం: హిరమండలంలోని సుభలయ న్యూబ్యారేజీ జంక్షన్‌లో అక్రమ నిర్మాణాలపై అధికారులు స్పందించారు. ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'టీడీపీ నాయకుడి కబ్జా పర్వం' కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు మురళీమోహన్ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ ఈఓ నరసింహరావు, సిబ్బంది అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. బస్ షెల్టర్ పిల్లర్ల చుట్టూ కట్టిన గోడను తొలగించారు. అసంపూర్తిగా ఉన్న బస్ షెల్టర్‌ను కాజేయడానికి టీడీపీ నాయకుడు ప్రయత్నించగా ఎట్టకేలకు అధికారులు స్పందించి అక్రమ కట్టడాలు తొలగించారు. ఎక్కడైనా ఆక్రమణలుంటే ఫిర్యాదు చేయాలని సూచించారు.

రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడిగా కొమ్ము


నియామక పత్రం అందుకున్న శంకరరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడిగా కొమ్ము రమణమూర్తిని నియమించారు. విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు నియామక పత్రం సోమవారం అందించారు.

సాంకేతిక సాయం

- భవిత కేంద్రాల్లో వినికిడి, దృష్టి లోపం గల విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత
- జిల్లాలో 30 భవిత కేంద్రాల్లో 1800 మంది విభిన్న ప్రతిభావంతులు
- దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ


శ్రీకాకుళం భవిత కేంద్రంలో తుంగాన మహేశ్వరికి ట్యాబ్‌ను అందజేస్తున్న సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ బి.గోవిందరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: భవిత కేంద్రాల్లో చదువుతున్న దృష్టి, వినికిడి లోపం ఉన్న బాలలకు ప్రభుత్వం సాంకేతిక సాయం అందజేస్తోంది. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రాల్లో చదువుతున్న వారికి ప్రభుత్వం ట్యాబ్‌లను పంపిణీ చేస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి మండల కేంద్రంలో సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వ సహకారంతో దివ్యాంగ విద్యార్థులకు సహిత విద్యా కేంద్రా(భవిత)లను ఏర్పాటు చేశారు. రూపాయి ఖర్చు లేకుండా వారు చదువుకునేందుకు రవాణా ఖర్చులతో సహా ఎన్నో ప్రోత్సాహకాలు, మరెన్నో రాయితీలను అందజేస్తున్నారు.

డిజిటల్ విద్య

వీరికి సాధారణ విద్యార్థుల మాదిరిగా డిజిటల్ విద్యను సైతం అందించాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. దివ్యాంగులకు కూడా ట్యాబ్‌లను అందజేసి వారి కలలను సాకారం చేస్తున్నారు. వినికిడి లోపం, దృష్టి లోపం ఉన్న వారికి ట్యాబ్‌లు అందజేయడంతో పాటు వారి వినియోగానికి వీలుగా 33 ప్రత్యేక యాప్‌లను కూడా వాటిలో పొందుపరిచారు.


శ్రీకాకుళం భవిత కేంద్రం

30 భవిత కేంద్రాల్లో..

జిల్లాకు అవసరమైన 240 ట్యాబ్‌లు స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసు కార్యాలయం నుంచి వచ్చాయి. శ్రీకాకుళం జిల్లాలోని 30 భవిత కేంద్రాల్లో ఉన్న 1800 మంది పిల్లల్లో 145 మంది వినికిడి, దృష్టి లోపాలు గల దివ్యాంగులను గుర్తించారు. 95 మంది సహిత విద్య టీచర్లు(ఐఈఆర్పీలు)కు ఈ ట్యాబ్‌లను అందజేశారు. ఒక ట్యాబ్ ఖరీదు రూ.28వేలు. ఈ లెక్కన జిల్లాకు రూ. 67.20లక్షల విలువ చేసే శాంసంగ్, లెనోవా వంటి బ్రాండెడ్ ట్యాబ్‌లను అందచేసి వారికి డిజిటల్ విద్యను అందేలా చేసింది. సహితవిద్యా కేంద్రంలోని ప్రత్యేక ఉపాధ్యాయులు వీరికి ఈ ట్యాబ్‌ల వినియోగం, పని చేసే తీరు తదితర అంశాలపై అభ్యసనను నేర్పుతున్నారు.

సౌకర్యంగా ఉంది..



మా కూతురు తుంగాన మహేశ్వరి శ్రీకాకుళం టీపీఎంహెచ్‌స్కూల్‌లో ఏడో తరగతి చదువుతుంది. మా పాపకు వినికిడి లోపం ఉంది. శ్రీకాకుళం భవిత కేంద్రం ద్వారా మా కూతురికి జగనన్న ప్రభుత్వం ట్యాబ్ అందించింది. మేము కూడా చేయలేని పనిని ప్రభుత్వం చేసి చూపించింది. మా పాపకు జగనన్న దేవుడయ్యారు. ఈ ట్యాబ్ ద్వారా ఇందులో ఉన్న యాప్‌ల ద్వారా ఇపుడు పాఠాలు నేర్చుకోవడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

– బీబీరాణి, ట్యాబ్ అందుకున్న బాలిక తల్లి, దండివీధి శ్రీకాకుళం

జిల్లాకు 240 ట్యాబ్‌లు అందజేత..



శ్రీకాకుళం పరిధిలో 240 ట్యాబ్‌లు స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసు నుంచి జిల్లాకు వచ్చాయి. 30 భవిత కేంద్రాల్లో వినికిడి, కంటిచూపు లోపాలున్న దివ్యాంగులు 145 మందికి, అలాగే వీరికి పాఠాలు బోధిస్తున్న ఐఈఆర్పీలు 95 మందికి ట్యాబ్‌లు అందజేశాం. ఐఈఆర్పీలకు ట్యాబ్‌ల వాడకం, వినియోగంపై స్టేట్ రిసోర్స్‌పర్సన్లతో శ్రీకాకుళంలో ఇప్పటికే శిక్షణను అందించాం. వారు తీర్చిదిద్దుతున్నారు.

– బుడుమూరు గోవిందరావు, సమగ్రశిక్ష సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్

సహిత విద్యపై ప్రత్యేక ఫోకస్



సహిత విద్యా కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు సాధారణ విద్యార్థుల మాదిరిగానే విద్యాబోధన అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ట్యాబ్‌ల అందజేత నిర్ణయం అభినందనీయం. జిల్లాలో సహిత విద్యపై కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా ఫోకస్ చేశాం. వినికిడి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు డిజిటల్ విద్యాభ్యాసం వల్ల ఎంతో మేలు కలుగుతుందని ప్రభుత్వం వారికి ట్యాబ్‌లను అందజేసింది.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఏపీసీ శ్రీకాకుళం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 30వ వార్డు ఉదయపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కొవ్వూరు వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. పలాసలో రూ.50కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పూర్తి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ ఛైర్మన్ భవానిశంకర్, పార్టీ జిల్లా కార్యదర్శి బడగల బల్లయ్య, కౌన్సలర్‌లు బోనెల రాము, సవర సోమేష్, మిన్నారావు, తోట సోమేష్, చమళ్ల రమణ కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై విశ్రాంత ఉద్యోగుల చర్చ


విశ్రాంత ఉద్యోగుల సమావేశం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాత బస్టాండ్ వద్ద గల ఎన్‌జీఓ హోమ్‌లో విశ్రాంత ఉద్యోగుల సమావేశం సోమవారం జరిగింది. కార్యక్రమంలో 60 మంది విశ్రాంత ఉద్యోగులు హాజరై వారి సమస్యలపై చర్చించారు. అలాగే జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది సౌజన్యంతో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సహాధ్యక్షుడు ఎంఎస్‌ఆర్.ఎస్ ప్రకాశరావు, జిల్లా సంఘం జనరల్ సెక్రటరీ పి.నరసింహమూర్తి, సిటీ బ్రాంచ్ అధ్యక్షుడు కె.సోమసుందరరావు, పిఎస్ ప్రసాదరావు, కోశాధికారి వేంకటేశ్వరరావు, బి.ఆదినారాయణ రావు, డీవీఎస్ ఆచారి గణపతి ఆచారి, ఆదినారాయణ, సవరయ్య, ఝాన్సీరాణి, డిఏ నరసమ్మ పాల్గొన్నారు.

ఏడెకరాల వరి పొలం దగ్ధం


కాలిపోయిన వరి పొలాన్ని చూపిస్తున్న రైతులు

పాతపట్నం: మండలంలోని ఏఎస్ కవిటి గ్రామానికి చెందిన ఆరుగురు రైతులకు చెందిన ఏడెకరాల వరి పొలం అగ్నికి ఆహుతయ్యింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి సోర్లండ రెవెన్యూ పరిధిలోని ఆరుగురు రైతులు ఎర్ర రామారావు, గద్దీ జగ్గారావు, సాద భాగ్యరాజు, సాధ నారాయణ, మిరియాబిల్లి శ్రీధర్, టంకాల సరోజినిలకు చెందిన సుమారు ఏడెకరాల వరిపంట అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. పొలంలో మంటలు రావడంతో స్థానికులు కొత్తూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. రెవెన్యూ అధికారులు పంట నష్టం పరిశీలించారు.

గ్రానైట్ అనుమతులు రద్దు చేయాలని ధర్నా

టెక్కలి: మెళియాపుట్టి మండలం పద్ద గ్రామం సమీపంలో సర్వే నంబరు 1 లో ఇంజాద్రికొండపై అక్రమంగా మంజూరు చేసిన గ్రానైట్ అనుమతులు రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వి.మాధవరావు డిమాండ్ చేశారు. సోమవారం టెక్కలి మైన్స్ ఏడీ కార్యాలయం ఎదుట గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా, పర్యావరణ అనుమతులు లేకుండా మంజూరు చేసిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే కొండపై గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తున్నారని, తక్షణమే మైనింగ్ అధికారులు చొరవ చూపి మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ మైనింగ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.భాస్కరరావు, గొరేష్, నూకయ్య, శ్రీను, సోమేష్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు సంక్షేమ భవనానికి స్థలం వితరణ


తూర్పుకాపు భవనం స్థలానికి సంబంధించి డాక్యుమెంట్లు అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తూర్పుకాపు సంక్షేమ సంఘానికి శ్రీకాకుళంలో 8 సెంట్ల స్థలాన్ని కొందరు వితరణగా అందజేశారు. రూ.1.20 కోట్లు విలువ చేసే స్థలాన్ని హారికాఇన్ పక్కన అందజేశారు. ఈ స్థలాన్ని రాష్ట్ర తూర్పుకాపు సంక్షేమం సంఘం కార్పొరేషన్ ఛైర్మన్ మామిడి శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్, ఇజ్జాడ శివన్నారాయణలు అందజేశారు. మామిడి శ్రీకాంత్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన నివాసంలో స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తూర్పుకాపులను అభివృద్ధి చేయడమే తమ అంతిమ లక్ష్యమన్నారు. ఇప్పటికే హారికా ప్రసాద్ రూ.10లక్షలు, కె.గణేష్ రూ.10లక్షలు, కలిశెట్టి గణపతి రూ.5లక్షలు అందించినట్లు తెలిపారు. సమావేశంలో పాండ్రంకి రమేష్, కైలాశరావు, సామాజికవర్గ పెద్దలు పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రి సందర్శన


కిడ్నీ ఆస్పత్రిని సందర్శించిన ఉద్దానం యూత్ ఫోర్సు ప్రతినిధులు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పద్మనాభపురం వద్ద గల కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రిని ఉద్దానం ప్రాంతానికి చెందిన యూత్ ఫోర్స్ సభ్యులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక ప్రత్యేకమైన ఆస్పత్రికి ఉండాల్సిన ఆధునాతనమైన వసతులతో ఈ ఆస్పత్రిని నిర్మించడం సంతోషకరమన్నారు. ఆస్పత్రి నిర్మాణంలో మంత్రి సీదిరి అప్పలరాజు కృషి అభినందనీయమన్నారు. ఈ ఆస్పత్రి భవిష్యత్‌లో మంచి ఫలితాలు ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజా వాగ్గేయ కారుడు కుత్తుం వినోద్, మాకన్నపల్లి సర్పంచి సైని దేశయ్య, కీలు నారాయణ, కారాట శ్యామ్, బత్తిన భాస్కర్, ఆనంద్, వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు
ఆదర్శ పాఠశాల విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

సోంపేట: సోంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు తిరుపతిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి దుద్ది కౌశిక్, 9వ తరగతి విద్యార్థి ఆనింగి తులసీరాం రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపల్, వ్యాయామ ఉపాధ్యాయుడు జైమారావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. అలాగే బారువ గ్రామానికి చెందిన విద్యార్థులు పల్నాడు జిల్లాలోని నరసరావు పేటలో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు శిక్షకుడు బి.మారుతీరావు తెలిపారు. అండర్–17 విభాగంలో ఎస్.గాయత్రి, అండర్–19 విభాగంలో ఎం.అఖిల్, జి.కామేశ్వరరావు అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

తర్లి ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడి ప్రతిభ


గోల్డ్ మెడల్ అందుకుంటున్న రవికుమార్

సారవకోట: మండలంలోని తర్లి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జన్ని రవికుమార్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో తన ప్రతిభ చూపించారు. ఈ నెల 8 నుంచి 10 వరకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆవరణలో జరిగిన 42వ మాస్టర్ అథ్లెటిక్స్‌లో నాలుగు పతకాలు సాధించారు. ఈ మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఆయన జావెలిన్ త్రో, పోల్‌వాల్ట్, 400 రిలే రన్‌లో బంగారు పతకం సాధించగా.. డిస్క్ త్రోలో సిల్వర్ పతకం సాధించారు. నాలుగు పతకాలు సాధించిన రవికుమార్‌ పాఠశాల సిబ్బంది, మండలంలోని గొర్రిబంద పంచాయతీ జగన్నాథపురం గ్రామస్తులు అభినందించారు. వచ్చే ఏడాది జనవరిలో పూణేలో జరగనున్న నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

'పోలీసులు నైపుణ్యాలు పెంచుకోవాలి'


పోలీసుల పరేడ్ పరిశీలిస్తున్న ఏఎస్పీ తిప్పేస్వామి

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసులు నైపుణ్యాలు మెరుగు పర్చుకోవాలని అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక పరేడ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాక్ డ్రిల్, మాబ్ ఆపరేషన్, వీఐపీ భద్రత, 144 సెక్షన్ అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సభలు, సమావేశాలు, విపత్తులు, రాస్తారోకాలు వంటి సమయాల్లో వ్యవహార శైలిపై డెమోలు నిర్వహించారు. పోలీస్ శాఖలో శాంతి భద్రతలకు సంబంధించిన ప్రతి అంశంలో అవగాహన, నైపుణ్యం సిబ్బందిలో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

'ఆస్పత్రి ప్రసవాలు పెంచండి'


జలుమూరులో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మీనాక్షి

జలుమూరు: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. ఆమె సోమవారం జలుమూరు పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకంలో జరిగిన ప్రసవాలు ఆన్‌లైన్ చేయాలన్నారు. వాతావరణంలో మార్పుల ఫలితంగా చిన్నారులు, అప్పుడే పుట్టిన పిల్లలకు శ్వాసకోస వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ నుంచి ఎంత మందిని ఇతర ఆస్పత్రులకు తరలించారో కూడా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆమెతోపాటు మెడకల్ అధికారులు టి.శ్రీకాంత్, చల్ల వంశీకృష్ణ సిబ్బంది ఉన్నారు.

బీలలో ఖరీఫ్ కోతలు


పుటియాదళలో వరికోతల్లో మహిళాకూలీలు


తూర్పారబట్టిన ధాన్యాన్ని ట్రాక్టర్లలో తరలిస్తున్న రైతు కూలీలు

కవిటి: మండలంలోని బీల ప్రాంతంలో ఖరీఫ్ వరికోతలు మొదలయ్యాయి. ఇక్కడ పొలాలన్నీ వర్షాధారమే. అయితే కవిటి మండలం బీల ప్రాంతంలో వ్యవసాయ ఉచిత విద్యుత్ బోర్ల కింద దాదాపు 2000 ఎకరాలు సాగవుతోంది. తాజాగా నెలవంక, కపాసుకుద్ది, పుటియాదళ, కవిటి, జగతి, బెజ్జిపుట్టుగ, బొరివంక, బి.గొనపుట్టుగ, వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మాణిక్యపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో తాజాగా వరికోతలు ఊపందుకుంటున్నాయి.

'పాణిగ్రాహి స్మారక సభను విజయవంతం చేయండి'

పలాస: పలాస మండలం బొడ్డపాడులో జిల్లా అమరవీరుల స్మారక మందిరం వద్ద ఈ నెల 22న జరగనున్న విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి స్మారక సభను విజయవంతం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ కోరారు. సంస్మరణ సభ ప్రచార యాత్ర సందర్భంగా పలాస మండలంలోని పాత్రియా, కొఠారితాళబద్ర, గట్టూరు, మున్సిపాలిటీలోని సూదికొండ ఉద్దానం ప్రాంతంలోని అనేక గ్రామాల్లో వారు పర్యటించి ప్రచారం చేశారు. సోమవారం గ్రామాల్లో కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.